క్లుప్తంగా

22వ వార్డులో కంటి వెలుగు శిబిరం



కళ్లద్దాలు అందజేస్తున్న స్రవంతి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు కంటి వైద్యాన్ని అందించాలన్న సంకల్పంతో ప్రతి వార్డులో ఈ కంటి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి ఉచితంగా పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ యూసుఫ్, బీఆర్ఎస్ నాయకులు తాళ్ల మహేష్‌గౌడ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జంగయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

మంచాల: మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ నిధులు రూ.4లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉప సర్పంచ్ పాండాల జంగయ్య గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యుడు చీరాల రమేష్, పీఏసీఎస్ డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జానీపాషా, స్థానిక నాయకులు పున్నం రాము, చంద్రయ్య, మల్లేశ్, శ్రీశైలం, ప్రవీణ్, శేఖర్, జంగాచారి, నర్సింహ, రాజు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయండి

ఎంపీడీఓ రాఘవులు



మూత్రశాలలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాఘవులు

ఆమనగల్లు: మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామంలో మంగళవారం పల్లెప్రగతి పనులను ఎంపీడీఓ రాఘవులు పరిశీలించారు. పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన డంపింగ్ యార్డు, శ్మశానవాటిక, ప్రకృతివనం, నర్సరీలను ఆయన పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. వేసవికాలంలో ఈజీఎస్ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హరితహారం కార్యక్రమం కోసం నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని కోరారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బట్టు అనురాధ, ఎంపీటీసీ బట్టు కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

దళిత కుటుంబానికి న్యాయం చేయండి

ఆమనగల్లులో దళిత బహుజన సంఘాల ర్యాలీ

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శాంతి నగర్ కాలనీకి చెందిన బొడిగల జంగమ్మ ఇంటి నిర్మాణానికి అడ్డుతగులుతున్న వారిపై చర్యలు తీసుకుని ఆ కుటుంబానికి న్యాయం చేయాలని అంతర్జాతీయ మానవ హక్కుల అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ బొల్లు మహేందర్ కోరారు. బొడిగల జంగమ్మ ఇంటి నిర్మాణానికి అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆమనగల్లు పట్టణంలో మంగళవారం దళిత బహుజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్‌కు నాయకులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ప్రజాసంఘాల నాయకులు రాజేందర్‌కుమార్, వెంకటేశ్, రమేశ్, కిరణ్, నర్సింహ, రమేశ్, శివకుమార్, రాజు, అల్లాజీ, యాదయ్య, శంకర్‌నాయక్, దేవేందర్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహేందర్

జోరుగా మట్టి తవ్వకాలు

- రామయ్య చెరువు, ఈరమోని కుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో..
- వట్టిపోతున్న చుట్టుపక్కల వ్యవసాయ బోర్లు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



తిప్పాయిగూడ ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి తవ్వకాలు

మంచాల: గ్రామాల్లో మట్టితవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. చెరువులు, కుంటలను సైతం పూడ్చివేసినా పట్టించుకునే నాథుడు లేడు. ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. తిప్పాయిగూడ గ్రామంలో గతంలో రామయ్య చెరువు కబ్జా చేయడమే గాకుండా ఏకంగా చెరువుకట్టను తొలగించారు. వర్షపునీరు నిల్వ ఉండటానికి వీలులేకుండా నాశనం చేశారు. రియల్ వ్యాపారులు భూములు కొనుగోలు చేసి ప్రజలకు ఉపయోగకరమైన చెరువులు, కుంటలను ధ్వంసం చేస్తున్నారు. చెరువు కట్టలను తొలగించి, చెరువు లోతట్టు ప్రాంతం మట్టితో నింపివేసి పూర్తిగా మాయం చేస్తున్నారు. గ్రామంలో పాడి పశువులకు, వ్యవసాయ పొలాలకు నీటి వనరుగా ఉన్న రామయ్య చెరువును కబ్జాను అరికట్టాలని రైతులు వాపోతున్నారు.

ఈరమోని కుంట కబ్జాకు యత్నం..

ఇదిలా ఉండగా తాజాగా తిప్పాయిగూడ గ్రామానికి సమీపంలో 100 సర్వే నంబర్‌లో ఉన్న ఈరమోని కుంట చెరువును కూడా ధ్వంసం చేసే పనిలో కబ్జాదారులు నిమగ్నమయ్యారు. ఈరమోనికుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి 6 ఎకరాలు, చెరువు శిఖం భూమి 2-28 ఎకరాలు. ఈ చెరువుకు సంబంధించిన చెక్‌డ్యాంను పూర్తిగా మట్టి పోసి ధ్వంసం చేశారు. చెరువుకు అనుసరించి ఉన్న పట్టాదారులు అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి ఎఫ్‌టీఎల్ పరిధి వరకు చెరువులో మట్టిపోశారు. అంతేగాకుండా చెరువులోకి నీళ్లు వచ్చే ప్రధాన వనరులుగా ఉన్న నీటి ప్రవాహ కాల్వలను కూడా ధ్వంసం చేసి మట్టితో నింపివేశారు. ఈ చెరువులోకి నీళ్లు రాకుండా చేసి చెరువు అస్తిత్వం దెబ్బతినే విధంగా పనులు చేస్తున్నారు. ఇప్పటికే రామయ్య చెరువును ధ్వంసం చేశారు. ఈరమోనికుంట చెరువును కూడా ధ్వంసం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ విషయంపై స్థానిక మత్స్యకారులు అటు రెవెన్యూ, ఇటు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు నామమాత్రంగా హెచ్చరికలు జారీచేసి చేతులు దులుపుకున్నారు. అధికారులు వచ్చిన సమయంలో రెండు హిటాచీలు, నాలుగు జేసీబీలు, మరో 6 టిప్పర్లు అక్కడ పనిచేస్తున్నాయి. కనీసం వాటిని సీజ్ చేయడం లేదా అక్రమ తవ్వకాలపై చర్యలు కూడా తీసుకోలేదు.

అధికారుల తీరుపై విమర్శలు..

అక్రమ మట్టి త్వకాలు జరుపుతున్న వారు అధికారులకు చేతులు తడపడంతో ఎలాంటి చర్యలు తీసుకోకుండా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తవ్వకాలను అడ్డుకొని చెరువులు, కుంటలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయంపై సంబంధిత అధికారులను వివరణ కోరగా అక్రమంగా తవ్వకాలు చేస్తున్న మాట వాస్తవమే. పనులు చేయవద్దని సూచించామని తెలిపారు.

❝ చర్యలు తీసుకోవాలి



గ్రామాల్లో అక్రమ మట్టి తవ్వకాలు జరపడమే గాకుండా వందల సంవత్సరాల కాలం నాటి చెరువులను ధ్వంసం చేస్తున్నారు. వ్యవసాయ బోర్లు వట్టిపోతున్నాయి. కబ్జాలకు గురవుతున్న చెరువులు, కుంటలను కాపాడాలి. అక్రమణదారులను కఠినంగా శిక్షించాలి.

– నర్సింహ, మత్స్యకారుల సహకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

కళాకారులకు ఆర్థిక సాయం

తలకొండపల్లి: అంతరించిపోతున్న కళలను బతికించుకుందామని ప్రముఖ వ్యాపారవేత్త, రియల్టర్ ఏమిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని చుక్కాపూర్‌లో యాదవుల ఆధ్వర్యంలో త్వరలో బీరప్పస్వామి చరిత్ర స్టేజి నాటకాన్ని ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా కళాకారులు పాండురంగారెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా మంగళవారం కలిసారు. స్టేజి నాటకానికి ఆర్థికసహాయం చేయాలని కోరారు. స్పందించిన పాండురంగారెడ్డి తన తల్లిదండ్రులైన ఏమిరెడ్డి మాదవరెడ్డి, భారతమ్మల జ్ఞాపకార్థం రూ.10 వేలను కళాకారులకు అందజేశారు. కార్యక్రమంలో కాగుల శేఖర్, దశరథం, రామస్వామి, యాదయ్య, వరికుప్పల దశరథం, శివుడు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న పాండురంగారెడ్డి

సమస్యలు పరిష్కరించండి



ఏపీఎంకు సమ్మె నోటీస్ ఇస్తున్న వీఓఏలు

- పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల డిమాండ్

కడ్తాల్: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించాలని జిల్లా సీఐటీయూ కమిటీ సభ్యులు గుమ్మడి కురుమయ్య, తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల పరిధిలోని వీఓఏలు తమ సమస్యలు పరిష్కరించాలని ఏపీఎం రాజేశ్వరికి మంగళవారం సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా కురుమయ్య మాట్లాడుతూ.. కడ్తాల్ మండలంలో 29 మంది వీఓఏలు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో గ్రామస్థాయిలో మహిళల అభ్యున్నతికి ఆర్థికంగా సామాజికంగా ఎదగడానికి గత 19 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని తెలిపారు. కొత్తకొత్త సర్వేలు అంటూ ఆన్‌లైన్ పనులు అంటూ పనిభారం పెంచుతూ వారికి పనికి తగిన వేతనం చెల్లించడం లేదని ఆరోపించారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని.. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు జానకీరాములు, కార్యదర్శి వనిత, కోశాధికారి జంగయ్య, సభ్యులు కవిత, అనుసూయ, సుధారాణి, శోభ, సునీత, అరుణ, కృష్ణవేణి, విజయ్, సుమన్, శ్రీలత, సుధారాణి, వనిత, తానేశ్, శత్రు ఉన్నారు.

సమ్మె నోటీస్ అందజేత..

తలకొండపల్లి: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని వీఓఏలు కోరారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లో సమ్మెకు సంబంధించి అధికారులకు సమ్మె నోటీస్‌లను వారు అందజేశారు. కార్యక్రమంలో వీఓఏల అధ్యక్షుడు బాలకిష్టయ్య, నాయకులు.. అరుణ, కల్పన, కృష్ణారెడ్డి, శశికళ, నర్సింహ, యాదమ్మ, మానస తదితరులు పాల్గొన్నారు.

అధికారం ముసుగులో అక్రమాలు

- పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న

అబ్దుల్లాపూర్‌మెట్: అధికార పార్టీ అండదండలతో భూ ఆక్రమణలకు పాల్పడుతూ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి, బీఆర్ఎస్ పార్టీకి చెడ్డపేరును తీసుకువచ్చేందుకు కొంతమంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు పూనుకున్నారని పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం చైర్‌పర్సన్ చెవుల స్వప్న చిరంజీవి ఆరోపించారు. వారు చేస్తున్న భూ కబ్జాలు, అక్రమాలకు తాను సహకరించడం లేదని అక్కసుతో తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. కౌన్సిలర్లు చేస్తున్న అవినీతి అక్రమాలను వివరించారు. అక్రమాలకు సంబంధించి పలు పత్రాలను చూపించారు. నేను చైర్మన్‌గా ఉండి అక్రమాలకు సహకరించడంలేదని దళిత మహిళ అని అవమానపరుస్తూ అనేక రకాలు ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. మున్సిపాలిటీ అభివృద్ధి విషయంలో ఏమాత్రం వెనకడుగు వేయకుండా 24 వార్డులకు సమానంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులు చేస్తూ రాజకీయాలకతీతంగా నేను ముందుకు వెళ్తున్నానని అన్నారు.



భూ ఆక్రమణలపై పత్రాలు చూపిస్తున్న చైర్‌పర్సన్ స్వప్న

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ఈద్గా అభివృద్ధికి విరాళం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

- ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకలని ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మజీద్ ఏ కుబాలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు పండ్లు తినిపించి, పవిత్ర షబ్-ఏ-ఖదర్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఈద్గా నిర్మాణానికి శ్రీనివాస్‌రెడ్డి రూ.75 వేలు విరాళం అందజేశారు. అదే విధంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ రూ.10 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా మజీద్ కమిటీ సభ్యులు దాతలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, మజీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షుడు జావీద్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసీఫ్‌అలీ, జహంగీర్‌అలీ, నాయకులు రాంచందర్‌నాయక్, ఇర్షాద్, మౌలానా జహీరుద్దీన్ పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ప్రశాంత్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తనయుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మంగళవారం మంత్రి కేటీఆర్‌ను కలిశారు. ఇటీవల నియోజకవర్గంలో నిర్వహించిన ప్రగతి నివేదన పాదయాత్ర సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను మంత్రి దృష్టికి ప్రశాంత్‌రెడ్డి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయా సమస్యల పరిష్కారానికి మంత్రి కేటీఆర్ నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.



మంత్రి కేటీఆర్‌తో ప్రశాంత్‌రెడ్డి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఆమనగల్లు: మాడ్గుల మండలం అందుగుల గ్రామానికి చెందిన స్వాతికి ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద రూ.14 వేలు మంజూరయ్యాయి. హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో మంగళవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు ఎంపీపీ అనిత విజయ్, నాయకులు గోలి సురేందర్‌రెడ్డి, జగన్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం..

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ కాలనీకి చెందిన పల్లె వెంకయ్యగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని మంగళవారం మండల గౌడసంఘం ఆధ్వర్యంలో పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో కంఠమేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ చుక్క అల్లాజీగౌడ్, మండల గౌడసంఘం అధ్యక్షుడు గంగారవిగౌడ్, నారాయణ, నాయకులు యాదయ్య, నాగయ్య, నిరంజన్, సతీష్‌గౌడ్, వెంకయ్య, లక్ష్మీపతి, మల్లేశ్, హరినాథ్, కుమార్‌గౌడ్, బాలకృష్ణ, అల్లాజీ, శ్రీను తదితరుల పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని అభయాంజనేయ స్వామి దేవాలయం నూతన కమిటీని మంగళవారం ఇంజాపూర్‌లో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పల్సం బుచ్చయ్య గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా గోపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణాచారి, వంశీ, ప్రధాన కార్యదర్శిగా నగేష్ యాదవ్, కోశాధికారి ప్రశాంత్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి సుమన్ గౌడ్‌ను ఎన్నుకున్నారు.

పేదలకు అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: యాచారం మండలం మల్కీజ్‌గూడలో హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమం సోమవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా యాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలకు, నిరుద్యోగులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, గురునాథ్‌రెడ్డి, నర్సింహ్మ, మంగమ్మ, వెంకట్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, యాదమ్మ, వెంకట్‌రెడ్డి, సుధాకర్, జంగారెడ్డిలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కందుకూరు: అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి తమ వంతు కృషి చేస్తున్నామని చిప్పలపల్లి ఇన్‌చార్జి సర్పంచ్ బాలకృష్ణ, ఎంపీటీసీ లలితకుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని చిప్పలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ షబానా ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రీ స్కూల్ విద్యను పూర్తి చేసుకున్న మూడు నుంచి ఐదేళ్లలోపు పిల్లలు 15మందిని ఒకటో తరగతికి ప్రమోట్ చేస్తూ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వాలు అందిస్తున్న పౌష్టికాహారం, ఉచిత విద్యను సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలస్వామి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనసూయ, అంగన్‌వాడీ టీచర్ రేణుక, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలపై దాడి..

- సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఓకు ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధి కూలీలపై దాడిచేసిన తలకొండపల్లి మండలం పడకల్ సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ హరిప్రియకు ఈమేరకు నేతలు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి జగన్ మాట్లాడుతూ.. ఈనెల 4వ తేదీన తలకొండపల్లి మండలం పడకల్ సర్పంచ్ చెవిటి రమేష్ కూలీలపై దాడిచేశారన్నారు. టెక్నికల్ అసిస్టెంట్‌ను కూలీలు డబ్బులు రాలేదని అడిగితే సర్పంచ్ కూలీలపై దాడి చేయడం ఏమిటని ప్రశ్నించారు. సర్పంచ్ బూతులు తిట్టడంతో ఓ మహిళ పురుగుల మందు తాగిందన్నారు. ఇంకా చాలా మందిపై దాడి చేయడం జరిగిందన్నారు. కూలీలపై దాడి చేసిన సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగయ్య, పద్మ, పుష్పలత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



డీఆర్‌ఓకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న అనిల్

- బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ అనిల్

తలకొండపల్లి: క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్ అన్నారు. మండల కేంద్రంలో త్వరలో టీపీఎల్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అనిల్ క్రీడాకారులను కలిశారు. టోర్నమెంట్ నిర్వహణకు తగిన ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు సందీప్, నవీన్, గోపి, బన్నీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరానికి స్పందన

తలకొండపల్లి: మండల పరిధిలోని జూలపల్లిలో మంగళవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీసీ వెంకటేశ్, హైదరాబాద్ కామినేని హాస్పిటల్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ప్రజలనుంచి విశేష స్పందన వచ్చింది. ఈ శిబిరంలో 265 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సరిత, దర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జైపాల్‌రెడ్డి, గౌడసంఘం కల్వకుర్తి తాలుకా అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ అశోక్‌గౌడ్, శ్రీను, భిక్షపతి, రమేష్, శివ కుమార్, రాజశేఖర్, శ్రీరాములు, మల్లేశ్, శ్రీశైలంగౌడ్, బుచ్చిబాబు, వైద్యులు పాల్గొన్నారు.



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

పేదలకు సేవలందించడమే లక్ష్యం

- ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

ఆమనగల్లు: నిరుపేదలకు సేవలు అందించడమే లక్ష్యంగా లయన్స్‌క్లబ్ పనిచేస్తుందని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మంగళవారం లయన్స్‌క్లబ్ మాజీ మల్టీపుల్ చైర్మన్ నరేందర్‌రెడ్డి వివాహ వార్షికోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్ వీల్స్ ఆన్ మీల్స్ కార్యక్రమంలో భాగంగా పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని లయన్స్‌క్లబ్ సభ్యులతో కలిసి అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. లయన్స్‌క్లబ్ జిల్లా 320ఏ పరిధిలోని 86 లయన్స్ క్లబ్‌లలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ప్రతిష్టాత్మకంగా వీల్స్ ఆన్ మీల్స్ కార్యక్రమం ప్రారంభించి నిరుపేదలకు అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. పేదవారి ఆకలి తీర్చడంలో ఆత్మసంతృప్తి ఉంటుందని ఆయన చెప్పారు. లయన్స్ క్లబ్‌లు అందిస్తున్న సేవా కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ కసిరెడ్డి రాంరెడ్డి, మాజీ రీజియన్ చైర్మన్ చంద్రశేఖర్, సభ్యులు నటరాజ్ యాదయ్య, కొండల్‌రెడ్డి, బాలకృష్ణ, పాషా, మోహన్‌రెడ్డి, రాంరెడ్డి, కొర్వి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కరుణాకర్‌రెడ్డి